# ఎదురుచూపులు

-జి.అరుణ

నేను తన కోసం ఎదురు చూస్తున్నాను. నాలుగు రోజుల్లో వస్తానని చెప్పిన మనిషి వారం గడిచినా ఇంతవరకూ రాలేదు. కారణమేమిటో తెలియదు.

ఈ రోజైనా వస్తే బావుండునని ఆశగా ఎదురుచూస్తున్నాను. గుమ్మం దగ్గర అలికిడి అయితే చాలు తల తిప్పి చూస్తున్నాను ఆత్రంగా. ఒళ్లంతా నొప్పులుగా, నోరు కాస్త చేదుగా ఉంది. నిన్నటి నుండి కొద్దిగా జ్వరంగా కూడా ఉంది. ఉదయం లేవాలనిపించక పోయినా బలవంతంగా లేచాను. స్కూలుకు వెళ్లడానికి పిల్లలిద్దరూ రెడీ అవుతున్నారు. కుక్కర్‌లో అన్నం వండి, బంగాళాదుంపలు ఉడికించి కూర చేసాను. బాక్సులు సిద్ధం చేసి ఇద్దరికీ అందించాను.

టిఫిన్ చేయడానికి ఓపిక లేదు. బ్రెడ్, జామ్ బాటిల్ డైనింగ్ టేబుల్ మీద పెట్టాను తినమన్నట్లుగా.బ్రెడ్ చూసి నా చిన్న కొడుకు అజయ్ ఏడుపుముఖం పెట్టాడు.

"ఇవ్వాళ టిఫిన్ చేయడానికి ఓపిక లేదు కన్నా. రేపు తప్పకుండా చేస్తాను. ఈ పూటకు బ్రెడ్ తిని సరిపెట్టుకో" అన్నాను అనునయంగా.

చిన్నవాడి వయస్సు పదేళ్లు. వాడి కంటే పెద్దవాడు పవన్ రెండేళ్లు పెద్ద. ఇంట్లో పరిస్థితుల్ని చక్కగా అర్థం చేసుకునే సుగుణం ఉంది పెద్దవాడికి.

"ఫర్వాలేదులేమ్మా. నీకు ఒంట్లో బాగుండలేదుకదా. నువ్వు కాసేపు రెస్టు తీసుకో. నేను తమ్ముడి సంగతి చూసుకుంటాను" అన్నాడు బ్రెడ్‌మీద జామ్ రాసి తమ్ముడి ఎదురుగా పెడుతూ.

ఇద్దరూ బ్రెడ్ తిని పాలు త్రాగి లేచారు. షూస్ వేసుకుని స్కూలుకు బయల్దేరారు. ఐదు నిముషాల్లో నడిచి వెళ్లేంత దగ్గరలోనే వుంది స్కూల్.

స్కూలుకు దగ్గరలో అయితే పిల్లలు రోజూ వెళ్లి, రావడానికి సౌకర్యంగా ఉంటుందని అద్దె ఎక్కువైనా భరించి ఈ ఇల్లు అద్దెకు తీసుకున్నాము.

మూడురోజుల క్రితం ఆయన ఊరికి వెళ్లారు. బయటకు వెళ్లడానికి నాకిప్పుడు ఓపిక లేదు.

"అజయ్! అన్నయ్య పక్కన నెమ్మదిగా నడువు. పరుగులు పెట్టకూడదు" అన్నాను చిన్నవాడిని ఉద్దేశించి.

అలాగే అన్నట్లు తలూపాడు.

పిల్లలు కనిపించినంత మేర చూసి తలుపు వేసాను.

ఇల్లంతా చిందరవందరగా ఉంది. నీట్‌గా సర్దడానికి ఓపికలేక మళ్లీ పడుకున్నాను.

గిన్నెలు చాలా ఉన్నాయి. నిన్న ఉదయం నుండి అంట్లు తోమలేదు.

రెండు రోజుల నుండి నేను, పిల్లలు విడిచిన బట్టలు అలాగే ఉన్నాయి.

చేయాల్సిన పనులు తలచుకుంటూ కళ్లు మూసుకున్నాను. నిద్ర పట్టబోతుండగా ఫోన్ మోగింది.

బద్దకంగా లేచి రిసీవర్ అందుకున్నాను.

"హేమా!" అన్నారు ఆయన మృదువుగా.

"మామయ్యా ఎలా ఉన్నారు? హాస్పిటల్ నుండి ఎప్పుడు డిశ్చార్జ్ చేస్తారు?" ఆత్రుతగా అడిగాను.

"బాగానే వున్నారు. ఈరోజు సాయంత్రం ఇంటికి పంపిస్తామని డాక్టర్ చెప్పారు. నేను రెండుమూడు రోజుల్లో వచ్చేస్తాను" అన్నారాయన.

"అలాగే" అన్నాను.

"పిల్లలు స్కూలుకు వెళ్లారా?"

"వెళ్లారు"

మరో రెండునిముషాలు మాట్లాడి ఫోన్ పెట్టేసారు ఆయన.

పని మనిషి వారంరోజుల క్రితం ఊరెళితే ఆయన నాలుగురోజుల క్రితం నెల్లూరు బయల్దేరి వెళ్లారు.

"పనిమనిషి రావడంలేదు. నీకు ఇబ్బంది కదా" అన్నారాయన ఊరికి వెళ్లేముందు.

"ఇవ్వాళో రేపో వచ్చేస్తుంది" అన్నాను తేలిగ్గా నవ్వేస్తూ.

గత నెలలో ఒకసారి వారంరోజులపాటు పనిలోకి రాలేదు.

నాల్గైదురోజులు వచ్చిందో లేదో ఏదో వంకతో మళ్లీ పదిరోజులపాటు కనిపించలేదు. దానికోసమే ఈ ఎదురుచూపులు.

గతనెలలో పదిహేడురోజులు పనిలోకి రాకపోయినా జీతం మొత్తం మామూలుగా ఇచ్చాను గానీ కోత పెట్టలేదు.

అంతకుముందు నెలలో కూడా ఇలాగే ఇబ్బంది పెట్టి ఐదేసిరోజులు చొప్పున మూడు దఫాలుగా మొత్తం పదిహేనురోజులు పనిలోకి రాలేదు.

ఇళ్లల్లో పని చేసుకుని జీవనం గడిపే వాళ్లకు జీతం తగ్గిస్తే ఇబ్బంది పడతారు. కాబట్టి ఎన్నడూ జీతంలో కట్ చేసే అలవాటు నాకు లేదు.

"మనం రోజూ ఎంతో డబ్బు ఖర్చు చేస్తాము. పనిమనిషికి ఇచ్చే డబ్బు విషయంలో పీనాసితనం చూపాల్సిన అవసరంలేదు. అవస

రాలు, ఇబ్బందులు ఎవరికైనా ఉంటాయి. వాళ్లకు జీతం ఇవ్వడంలోను, మిగిలిపోయిన అన్నంకూరలు ఇవ్వడంలోనూ కాస్త ఉదారంగా వ్యవహరిస్తే కృతజ్ఞతతో సక్రమంగా పని చేస్తారు" అని చెబుతారాయన.

నేను అక్షరాలా ఆయన చెప్పినట్లే చేస్తాను. జీతంతో కోత పెట్టకపోయినా అప్పుడప్పుడు పాత చీరలు ఇస్తూ ఉదారంగా వ్యవహరించినా పనిమనిషికి ఎలాంటి కృతజ్ఞతలేదు.

నిజానికి కృతజ్ఞత ఉండనవసరంలేదు. కానీ జీతం తీసుకుంటున్నందుకు వేళకు వచ్చి సక్రమంగా పని చేస్తే చాలు.

టైమ్‌కు వచ్చే అలవాటులేదు సరికదా చక్కగా పని చేసే స్వభావం కూడాలేదు. హడావుడి పడుతూ రెండు నిముషాల్లో పని ముగించుకుని వెళ్దామనుకుంటుంటుందిగానీ నీట్‌గా ఎన్నడూ పని చేయదు.

ప్రతీదీ నేను మళ్లీ శుభ్రం చేసుకోవాల్సి వస్తుంది.

మొన్నామధ్య అన్నయ్య, వదిన వచ్చి రెండు రోజులు ఉన్నప్పుడు పనిమనిషి రాలేదు.



నేను టెన్షన్ పడుతూ పిల్లల్ని స్కూలుకు పంపిస్తుంటే వదిన పనిలో సాయం చేస్తూ నవ్వింది.

"నిన్ను ఒక్కదాన్నే పనిమనిషి ఇలా ఏడిపిస్తుందేమో అనుకుంటున్నావు కదూ? ప్రతి ఇంట్లోనూ ఇదే కథ. ఇది ఇంటింటి వ్యథ. వాళ్లతో సక్రమంగా పని చేయించుకోవడం ఎవరివల్లా కావడంలేదు. మా పక్కింట్లో ఉండే సుధ నీకు తెలుసుకదా. పదిరోజులక్రితం వాళ్లింట్లో ఏం జరిగిందో చెబుతాను విను.

'హైరానా పడుతూ సగం సగం పని చేస్తావెందుకు? కాస్త నిదానంగా, శుభ్రంగా చేయరాదూ?' అని పనిమనిషితో అందిట.

మాటకు మాట పెరిగి పనిమనిషి తోముతున్న గిన్నెలు అలాగే వదిలేసి వెళ్లింది. ఆ రోజు నుండి వరుసగా రెండురోజులపాటు మా అపార్ట్‌మెంట్స్‌లో 20 ఫ్లాట్స్‌లోని పనివాళ్లు అందరూ రావడం మానేసారు. కారణం అడిగితే సుధ పనిమనిషితో ఘర్షణ పడిందని, ఆమె సారీ చెబితేగానీ తామందరం పనిలోకి రామని గట్టిగా చెప్పారు.

ఇతర ఫ్లాట్లలోని ఆడవాళ్లందరూ సుధను కలసి పనిమనిషికి సారీ చెప్పమని అడిగారు.

నేను చెప్పనని గట్టిగా అంది తను. ఆమెవల్ల తామందరం ఇబ్బంది పడుతున్నామని అందరూ కోరస్‌గా అరిచేటప్పటికి తప్పనిసరి పరిస్థితుల్లో పనిమనిషికి సారీ చెప్పింది సుధ.

విజయదరహాసంతో పనివాళ్లందరూ యథావిధిగా పనిలోకి వచ్చి అప్పుడప్పుడు చెప్పకుండా మానేస్తూ ఇబ్బంది పెడుతూనే వున్నారు. సుధకు అవమానం అనిపించింది కాబోలు పనిమనిషిని మాన్పించి తనే స్వయంగా పని చేసుకుంటోంది ఇప్పుడు"

తమ అపార్ట్‌మెంట్స్‌లో పనిమనుషులు పెడుతున్న బాధల గురించి వివరంగా చెప్పింది వదిన.

"ఆడవాళ్లకు శక్తి, ఓపిక ఎప్పుడూ ఒకేలా ఉండవు వదినా. పని చేసుకోలేని సందర్భాల్లో, బలహీనంగా, నీరసంగా ఉన్నప్పుడు పనిమనిషి ఉంటే కాస్త సాయంగా ఉంటుందని పెట్టుకుంటాము. కానీ మనకు నీరసంగా ఉన్నప్పుడు లేదా చుట్టాలు వచ్చి పని వత్తిడి ఉన్నప్పుడు వాళ్ల నుండి మనకు ఏమాత్రం సాయం అందడంలేదు"

"అవును వదినా. పనివాళ్లవాళ్ల కలిగే పాట్లు అన్నీ ఇన్నీకావు" అంటూ తన అనుభవాలను, బాధలను ఇంకాస్సేపు వర్ణించి చెప్పింది వదిన.

"మీకు మరో టాపిక్ దొరకలేదా? పనిమనుషుల గురించి ఉదయం నుండి ముచ్చట్లు చెప్పుకుంటున్నారు" అన్నయ్య నవ్వుతూ అన్నాడు.

వదిన, నేను కూడా నవ్వేసాము.

ఆలోచనలు కట్టిపెట్టి లేని ఓపిక తెచ్చుకుని రాగిపిండితో కొద్దిగా జావ తయారు చేసుకుని తాగాను.

కాస్త శక్తి పుంజుకున్నట్లు అనిపించింది.

పక్క పోర్షన్‌లో పని చేసి తిరిగి వెళుతున్న పనిమనిషిని పిలిచాను.

"మా పనిమనిషి వారంరోజుల నుండి రావడంలేదు. నాకు జ్వరంగా ఉంది. ఈ ఒక్కరోజు పని చేస్తావా? డబ్బులిస్తాను" అన్నాను ఆశగా.

రవ్వంత సానుభూతిగా చూసింది నావైపు.

"నాకు ఇంకా చాలా పని వుంది. నాలుగిళ్లల్లో పని చేసి త్వరగా ఇంటికి వెళ్లాలి" అంటూ గబగబా నడిచింది.

ఇక లాభం లేదనుకున్నాను. ఓపిక ఉన్నా లేకపోయినా పని చేయాలని నిర్ణయించుకున్నాను.

నెమ్మదిగా గిన్నెలన్నీ తోమి సర్దేశాను. గ్యాస్‌స్టవ్ శుభ్రం చేసి వంటగది సర్దాను.

ఇల్లు ఊడ్చి తడిబట్టతో తుడిచాక మనసుకు ఆహ్లాదకరంగా అనిపించింది.

బట్టల పని ఒక్కటి మాత్రం మిగిలింది.

చేతులు, భుజాలు, నడుము నొప్పి పెడుతుంటే పదినిముషాలు విశ్రాంతి తీసుకున్నాను.

గోరువెచ్చని నీళ్లల్లో బట్టలు కొద్దిసేపు నానబెట్టాను. పీట వేసుకుని కూర్చుని బట్టలు ఉతికి ఆరేసాను. బాల్కనీ శుభ్రం చేసి స్నానం చేసాక ప్రాణానికి హాయి అనిపించింది.

పిల్లలు సాయంత్రం ఇంటికి వచ్చేటప్పటికి టిఫిన్ చేద్దామనుకుని ఉల్లిపాయలు తరుగుతుండగా పనిమనిషి వచ్చింది.


కోపం తమాయించుకుని "ఇప్పుడా రావడం?" అని అన్నాను.

"ఊరినుండి రావడం ఆలస్యమైంది" అంటూ పెడసరంగా మాట్లాడింది.



## ఆల్ ది బెస్ట్

భూమికకి టాలీవుడ్ అన్నా, హైదరాబాదన్నా ఎంతో అభిమానం. తనకి ఇంత గుర్తింపు వచ్చింది ఇక్కడే కదా! అందుకనే ముంబాయిలో కాకుండా తన నివాసాన్ని హైదరాబాదులోనే ఏర్పాటు చేసుకుందామె. తెలుగు వారిపై తనకున్న అభిమానాన్ని చాటుకోడానికా అన్నట్లు ఇప్పుడామె ఓ తెలుగు సినిమా వీక్లీని ప్రారంభించాలని అనుకుంటోందిట. 'సినీ మాయా బజార్' అనే ఈ పత్రికతోపాటు ఓ వెబ్‌సైట్‌ని నిర్వహించాలనుకుంటోందిట భూమిక. ఆల్ ది బెస్ట్ భూమికా!



చేయడానికి పనేమీ లేకపోవడంతో వెళ్లిపోయింది.

★★★

వారం గడిచింది. ఈసారి పదిరోజులుపాటు తిరిగి పనిమనిషి రాలేదు. ఎందుకు రావడంలేదో కారణం కూడా తెలియదు.

ఇబ్బందులు ఎవరికైనా ఉంటాయి.

నిజమే. నిజంగా అవసరమైతే ఎన్నిరోజులు సెలవు కావాలో ముందుగా చెప్పి మానేస్తే బావుంటుంది. కానీ తనకు అటువంటి మంచి అలవాటు లేదు.

"అక్షరజ్ఞానం లేకపోవడం, క్రమశిక్షణ లోపించడం మొదలైన బలహీన తలవల్ల ఇంతకుమించిన సంస్కారం వారి నుండి ఆశించడం మన అత్యాశ అవుతుంది'' అన్నారాయన.

పనిమనిషితో విసిగిపోయిన నేను ఒక నిర్ణయానికి వచ్చేసాను.

"ఇక నుండి పనిమనిషి వద్దు. నేనే చేసుకుంటాను'' అన్నాను శ్రీవారితో.

"పిల్లలకు అన్నీ వేళకు అమర్చి పెడుతూ ఇల్లు చక్కదిద్దుకోవడం నీకు కష్టమవుతుందేమో! ఈమెను మాన్పించి మరొకర్ని పెట్టుకుందాం'' అన్నారు.

"ఊహూ...వద్దు. మరో పనిమనిషి అయినా ఇంచుమించుగా ఇలాగే విసిగిస్తుంది. సంవత్సరాల తరబడి అనుభవంతో చెబుతున్న మాట ఇది. ఒంట్లో బాగుండనప్పుడు, చుట్టాలు వచ్చినప్పుడు చేతి కింద పనిమనిషి ఉంటే కాస్త తేలిగ్గా ఉంటుందని మనం అనుకుంటాం. కానీ ఎన్నడూ మనం అనుకున్నట్లు జరగదు. ఎక్కడి పని అక్కడ వదిలేసి తన కోసం ఎదురుచూపులు చూడడం మంచిది కాదని అర్థమైంది. ఇన్నాళ్లు మీరు వాషింగ్ మిషన్ కొంటానంటే వద్దని నేను అడ్డుపడ్డాను. మిషన్ కొనేందుకు, కరెంటు వాడకానికి అయ్యే ఖర్చు బదులు బట్టలు ఉతికినందుకు పనివాళ్లకు డబ్బు ఇస్తే సరిపోతుంది కదా అనుకుని వద్దన్నాను. అందుకే వాషిన్ మిషన్ కొనుక్కురండి. ఇక పనులన్నీ నేను చేసుకుంటాను'' అన్నాను.

పనిమనిషి మీద ఆధారపడి నేను పడుతున్న అవస్థలు రోజూ చూస్తున్న మావారు 'సరే' అన్నట్లుగా తలూపారు.

★★★

చెప్పకుండా వారం రోజులు నాగా పెట్టిన పనిమనిషి అకస్మాత్తుగా ప్రత్యక్షమైంది.

రేపటినుండి పనిలోకి రానవసరంలేదని చెప్పాను. నెల ఆఖరి రోజు అది. ఎలాంటి కోత విధించకుండా నెల జీతం ఇచ్చేసాను.

కించిత్తు కూడా బాధ పడకుండా డబ్బు తీసుకుని చీర కొంగుతో ముడి వేసుకుంది. మొన్నా మధ్య దసరా పండుగకు నేను పెట్టిన కొత్త చీర అది.

"మరో పనిమనిషిని పెట్టుకున్నారా?'' కాస్త వెటకారంగా అంది.

"ఊహూ... పెట్టుకోలేదు. నేనే చేసుకుంటాను'' అన్నాను తేలిగ్గా నవ్వేస్తూ.

★★★

ఇప్పుడు నా ప్రాణానికి హాయిగా ఉంది. వేకువఝామున నిద్ర లేచి పనులు చేసుకోవడం అలవాటైంది.


ఇల్లు శుభ్రంగా ఉంటోంది. గిన్నెలు ఇంకాస్త పరిశుభ్రంగా ఉండి మెరుస్తున్నాయి. క్రమపద్ధతిలో నిత్యం పని చేయడంవల్ల కాస్త బరువు తగ్గాను కాబోలు శరీరం తేలికగా ఉంటోంది.

మనసు కూడా ప్రశాంతంగా ఉంది. ఇప్పుడు నేను సాయంత్రమయ్యేసరికి మావారి కోసం, పిల్లల రాకకోసం ఎదురు చూస్తున్నాను కానీ రోజంతా ఆమె కోసం ఎదురుచూడడంలేదు.

ఎన్నో ఏళ్లుగా దాదాపు ఐదారుగురు పనిమనుషులతో నేను ఎదుర్కొన్న సమస్యను ఇలా పరిష్కరించుకున్నాను. నాకు చేతనైన పరిష్కార మార్గమిది.

సమస్యను ఈ విధంగా పరిష్కరించుకోవడం అందరికీ సాధ్యం కాకపోవచ్చు. ఉద్యోగం చేస్తున్న మహిళలు, తీవ్ర అనారోగ్యంతో బాధపడేవాళ్లు, వృద్ధాప్య దశలో వున్నవారు 'ఆమె' కోసం నిత్యం ఎదురు చూడాల్సిందేనేమో అనుకున్నాను లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తున్న ఎదురింటి వసంత పడుతున్న టెన్షన్‌ను చూసి.

★



## నేను రెడీ!

'మర్మయోగి' కోసం కొత్త సినిమాలేవీ ఒప్పుకోని త్రిష ఇప్పుడు ఆ సినిమా షూటింగ్ కొన్నాళ్లు వాయిదా పడడంతో- తిరిగి కొత్త అసైన్‌మెంట్లు అంగీకరించడానికి రెడీ అవుతోందిట. వాటిలో భాగంగానే జూనియర్ ఎన్టీఆర్‌తో త్రిష ఓ సినిమా ఒప్పుకునే చాన్సు వుందని వినికిడి. దీనికి సెల్వ రాఘవన్ (ఆడవారి మాటలకు అర్థాలు వేరులే దర్శకుడు) దర్శకత్వం వహించవచ్చునట.

